నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 | ఖమ్మం, శనివారం 1 జూన్ 2024 | KHAMMAM

# హరితహారంపై నీలినీడలు

- నాటిన మొక్కలను గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కార్
- ఏపుగా పెరిగిన మొక్కలకు నీరందక ఎండిపాయె..
- జిల్లావ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచిన గత కేసీఆర్ ప్రభుత్వం
- ఐదు నెలలుగా పర్యవేక్షించేవారు లేక మాడిపోతున్న పరిస్థితి
- తొమ్మిదేళ్లలో 13.89 కోట్ల మొక్కలు నాటితే.. ఇప్పుడు 50 శాతం కనుమరుగు

ఖమ్మం, మే 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పర్యావరణ పరిరక్షణ కోసం.. భవిష్యత్ తరాల కోసం పచ్చదనాన్ని పెంచేందుకు కంకణం కట్టుకున్న రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2015లో హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి లక్ష్యాన్ని నిర్దేశించి విడతల వారీగా అమలు చేశారు. ఊరూరా నర్సరీల్లో పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలను పెంచుతూ.. నిరంతరం వాటికి ట్యాంకర్ల ద్వారా నీరందిస్తూ ప్రతి వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు వివిధ శాఖల అధికారులను భాగస్వాములను చేశారు. ఖాళీ ప్రదేశాలు, పొలం గట్లు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడాన్ని పండుగలా చేపట్టారు. నాటిన మొక్కలకు నీరందించే బాధ్యతను పంచాయతీలు, మున్సిపాలిటీ సిబ్బంది చేపట్టేలా చేశారు. జిల్లావ్యాప్తంగా తొమ్మిదేళ్ల కాలంలో సుమారు 13.86 కోట్ల మొక్కలు నాటారు. గత కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు అధికారులు, సిబ్బంది నాటిన మొక్కలను కంటికి రెప్పలా కాపాడారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన ఐదు నెలల్లోనే మొక్కలకు నీరందించేవారు కరువయ్యారు. మండుతున్న ఎండలతోపాటు నాటిన మొక్కలకు నీరందక మలమలమాడిపోతున్నాయి.

## మొక్కల పట్టింపులేని కాంగ్రెస్ సర్కార్

ప్రధానంగా రాష్ట్ర, జాతీయ రహదారుల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్‌లు గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ రహదారుల వెంట మొక్కలను విరివిగా నాటారు. కానీ.. నాటిన మొక్కలను కాపాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది వాటి గురించి పట్టించుకోకపోవడంతో నాటిన మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. రహదారుల వెంట మొదటి విడతలో నాటిన మొక్కలు చెట్లుగా మారడంతో వాటిని నరికివేసినా పట్టించుకునేవారు కరువయ్యారు. కొన్నిచోట్ల విద్యుత్ శాఖ అధికారులు చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తాకుతున్నాయనే నెపంతో విచక్షణా రహితంగా కొట్టివేస్తున్నారు.

## పల్లె ప్రకృతి వనాలు, పార్కుల్లో కనిపించని పచ్చదనం

జిల్లాలో గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 751 గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాల్లో 12.89 కోట్ల మొక్కలను నాటారు. అర్బన్ పార్కుల్లో సుమారు కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి మండలంలో 10 ఎకరాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వం మొక్కలు విరివిగా నాటితే.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో వాటి ఆలనా పాలనా చూసే నాథుడే లేడు. మొక్కలు నాటే కార్యక్రమానికి గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జిల్లావ్యాప్తంగా రూ.50 కోట్లు కేటాయించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. అన్ని పంచాయతీల పరిధిలోని నర్సరీల్లో ప్రస్తుతం 50 లక్షల మొక్కలు పెరుగుతున్నాయి. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పథకం అమలుపై ఎలాంటి మార్గదర్శకాలు అధికారులకు జారీ చేయలేదు. దీంతో పెంచిన మొక్కలు నాటాలా.. వద్దా.. అనే సందేహం అధికారుల్లో తలెత్తుతోంది. ఇప్పటికే డీఆర్‌డీఏ, మైనింగ్, పరిశ్రమలు, అటవీ, పంచాయతీరాజ్ శాఖలకు నిర్దేశిత లక్ష్యాలను గత కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం అది అమలు చేస్తుందా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.



అశ్వారావుపేట టౌన్ : కళ తప్పిన అల్లిగూడెం పల్లె ప్రకృతి వనం



కల్లూరు మండలం కొత్తబోడుమల్లెలో నిరుపయోగంగా ఉన్న పల్లె ప్రకృతి వనం



పెనుబల్లి : తాళ్లపెంటలో ఇరువైపులా మొక్కలు లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్న బీటీ రోడ్డు

## ఐదు నెలలాయె.. నీళ్లందవాయె..!

- రోడ్ల వెంట నాటిన మొక్కలకు ఆలనాపాలనా కరువు
- కొన్నిచోట్ల నీరందక ఎండిపోతున్నా పట్టించుకోరు..
- పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల్లో నాటిన మొక్కలకు దిక్కేలేదు..
- పలుచోట్ల కరెంటు తీగలకు అడ్డొస్తున్నాయని నరికివేస్తున్న విద్యుత్ సిబ్బంది

భద్రాద్రి కొత్తగూడెం, మే 31 (నమస్తే తెలంగాణ) : ఊళ్లను వనాలు చేయాలనే లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి విడతల వారీగా లక్ష్యాలను నిర్దేశించి మొక్కలు నాటింది. నాటిన మొక్కలు ఏపుగా పెరిగేందుకు పంచాయతీల పరిధిలో నిరంతరం నీరందిస్తూ పచ్చదనంతో కళకళలాడేలా చేసింది. అంతేకాక పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల్లో తీరొక్క మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిఢవిల్లేలా చేసింది. కానీ.. ఐదు నెలల కాంగ్రెస్ ప్రభుత్వం.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలకు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల్లో నాటిన మొక్కలకు నీరందించలేని స్థితిలో ఉన్నది. దీంతో మొక్కలన్నీ ఎండిపోయి మోడుగా దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడ రోడ్ల వెంట మొక్కలకు నామమాత్రంగా నీళ్లు పోస్తూ చేతులు దులుపుకుంటున్నారు.



సుజాతనగర్ మండలం సర్వారం జీపీలో పల్లె ప్రకృతి వనంలో కనిపించని మొక్కలు

### ఎండిపోతున్న పల్లె పకృతి వనాలు

గత కేసీఆర్ ప్రభుత్వం జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల్లో 1,100కు పైగా పల్లె ప్రకృతి వనాలను అట్టహాసంగా ఏర్పాటు చేసింది. వాటి ఆలనా పాలనా చూసుకోవడంతోపాటు నిరంతరం నీరందించడంతో పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. కానీ.. చుంచుపల్లి, సుజాతనగర్, పాల్వంచ, టేకులపల్లి, గుండాల, చర్ల, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట మండలాల్లో వాటి నిర్వహణ కరువైంది. దీంతో మొక్కలన్నీ ఎండిపోయే దశకు చేరాయి. సుజాతనగర్‌లోని ప్రకృతి వనానికి గేట్ ఊడిపోవడంతో పశువులు వెళ్లి మొక్కలను తినేస్తుండడంతో ప్రకృతి వనం కళ తప్పింది.

### విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని..

విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయనే సాకుతో ఏపుగా పెరిగిన హరితహారం మొక్కలపై విద్యుత్ శాఖ అధికారులు వేటు వేస్తున్నారు. మూడు నెలల నుంచి విద్యుత్ శాఖ సిబ్బంది రహదారుల వెంట ఉన్న పెద్ద పెద్ద కొమ్మలను నరికి వేస్తున్నారు. దీంతో రోడ్ల వెంట పచ్చదనం కనుమరుగైంది.

### బృహత్ పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలేవి?

జిల్లావ్యాప్తంగా ఒక్కో మండలంలో 8 నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో 110 బృహత్ పల్లె ప్రకృతి వనాలను గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. వాటిలో పూర్తిస్థాయిలో స్థలం లేకపోవడంతో 105 వరకే అందుబాటులోకి తెచ్చారు. కానీ.. వాటిలో ఏపుగా పెరిగిన మొక్కలకు నీరందక ఎండిపోయాయి. దీంతోపాటు జిల్లాలో 1,280 క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు స్థలం సేకరించగా.. అందులో 686 ప్రాంగణాలకు స్థలం దొరికింది. అయితే నిర్వహణ లేకపోవడంతో ఆయా ప్రాంగణాల్లో నాటిన మొక్కలన్నీ పశువుల పాలయ్యాయి. 90,394 మొక్కలు క్రీడా ప్రాంగణాల్లో ఉండాల్సి ఉండగా.. అందులో అనుకున్న స్థాయిలో మొక్కలు లేకపోవడంపై క్రీడాకారులు పెదవి విరుస్తున్నారు.

### ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి



గత కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఏటా గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను పెంచి ఇంటింటికీ ఆరు మొక్కల చొప్పున అందించారు. అలాగే రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించారు. రోజూ వాటికి నీరు పోయడంతో పచ్చగా ఏపుగా ఎదిగాయి. ప్రస్తుతం వాటికి రక్షణగా చుట్టూ కంచెలు లేకపోవడం, నీరందించకపోవడంతో ఎండిపోతున్నాయి. ఎండిపోయిన మొక్కల ప్రదేశంలో మళ్లీ మొక్కలు నాటడం లేదు. ప్రభుత్వం మొక్కల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి వాటిని కాపాడాలి. **-జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీపీ, అశ్వారావుపేట**

### నిరంతరం నీళ్లు పోస్తున్నారు



పంచాయతీ సిబ్బంది హరితహారం మొక్కలకు ప్రతి రోజూ నీళ్లు పోస్తున్నారు. పల్లె ప్రకృతి వనాల్లో మొక్కల నిర్వహణ గురించి ఎంపీవోలతో మాట్లాడతాను. ఎక్కడ బాగాలేదో చూస్తాను. అన్ని పంచాయతీల్లో పంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది వాటి నిర్వహణ చూస్తున్నారు. ఎక్కడైనా మొక్కలకు నీరందకపోతే ఎంపీవోలతో మాట్లాడి చూడమని చెబుతాను.

**-చంద్రమౌళి, డీపీవో, భద్రాద్రి కొత్తగూడెం**

### 'హరిత' మొక్కలకు దిక్కులేదు



గత కేసీఆర్ పాలనలో పల్లె ప్రకృతి వనాలు, రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడంతోపాటు వాటిని కంటికి రెప్పలా కాపాడుకున్నాం. పచ్చదనంతో కళకళలాడుతుంటే మళ్లీ మళ్లీ చూడాలనిపించేది. కానీ.. ఇప్పటి ప్రభుత్వం రోడ్ల వెంట నాటిన మొక్కలను, ప్రకృతి వనాల్లోని మొక్కలను గాలికి వదిలేసింది. రోడ్ల వెంట నాటిన మొక్కలకు రక్షణ లేక పశువులు మేస్తున్నాయి. ప్రకృతి వనాల్లో మొక్కలకు నీరు లేక ఎండిపోయి దర్శనమిస్తున్నా పట్టించుకునేవారు లేరు.

**-తేజావత్ తావునాయక్, మాజీ సర్పంచ్, పెనుబల్లి**

## ఆయిల్‌పాం సాగుతో నికర ఆదాయం

### భద్రాద్రి జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ



ఆయిల్ పాం తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ

అన్నపురెడ్డిపల్లి, మే 31 : ఆయిల్‌పాం సాగుకు మండలంలోని నేలలు అనుకూలంగా ఉన్నందున సాగుతో రైతులు నికర ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం తాటి బుచ్చన్నగూడెం గ్రామంలో ఆయిల్‌పాం తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వమే ఆయిల్‌పాం మొక్కలు, డ్రిప్‌ను సబ్సిడీపై అందిస్తుందని తెలిపారు. ఆయిల్‌పాం సాగులో అంతర పంటలు వేసి అదనంగా ఆదాయం పొందవచ్చన్నారు. పంటకు కోతుల బెడద, ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల బాధలు ఉండవన్నారు. మొక్కలకు తప్పనిసరిగా బోరాన్, మెగ్నీషియం అధికారుల సూచన మేరకు వినియోగించాలన్నారు. నీటిని, ఎరువులను డ్రిప్ పద్ధతిలో సులభతరంగా అందించవచ్చన్నారు. ఆయిల్‌పాం సాగు కోసం రైతులకు అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌వో శాంతిప్రియ, ఉద్యాన శాఖ, గోద్రెజ్ కంపెనీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా 'బడిబాట' నిర్వహించాలి


### భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, మే 31 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. స్థానిక ఐడీవోసీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ఆవాస ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్య, ఉపకార వేతనాలు తదితర ప్రోత్సాహకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరూ పాఠశాలల్లో చేరేలా చూడాలన్నారు. బడి మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, మహిళా సమాఖ్యల ద్వారా వారి తల్లిదండ్రులతో మాట్లాడి అర్హత కలిగిన తరగతుల్లో తిరిగి చేర్పించేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఈవో వెంకటేశ్వరాచారి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి, మైనార్టీ సంక్షేమాధికారి, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్లు, ఎంఈవోలు పాల్గొన్నారు.

## తాగునీళ్లొచ్చాయ్..



కొత్త మోటర్ అమర్చుతున్న అధికారులు

**తాగునీటి కోసం వినోభానగర్ గ్రామస్తులు గురువారం రాష్ట్రీయ రహదారిపై బైఠాయించి చేసిన ఆందోళనతో అధికార యంత్రాంగం దిగొచ్చింది. శుక్రవారం గ్రామానికి చేరుకున్న పంచాయతీ అధికారులు మరమ్మతుకు గురైన విద్యుత్ మోటర్ స్థానంలో కొత్త మోటర్‌ను అమర్చారు. దీంతో 20 రోజులుగా గ్రామస్తులు పడిన తాగునీటి కష్టాలు తొలగినట్లుయింది. *-జూలూరుపాడు, మే 31***

## నకిలీ విత్తనాల్లేకుండా గట్టి నిఘా

- జిల్లాలో సాగుకు సరిపడా విత్తనాలు
- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్
- నగరంలోని పలు విత్తన దుకాణాల్లో తనిఖీలు



ఖమ్మంలోని విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం వ్యవసాయం, మే 31 : జిల్లాలో ఎక్కడ కూడా నకిలీ విత్తనాల విక్రయాలు చేపట్టకుండా గట్టి నిఘా పెట్టామని, ఇందుకోసం వ్యవసాయ, పోలీసు అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని బర్మాషెల్ రోడ్, గాంధీచౌక్‌లోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను కలెక్టర్ తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్, అమ్మకం, రసీదులను పరిశీలించారు. కచ్చితంగా స్టాక్ బోర్డులో వివరాలు నమోదు చేయాలన్నారు. విత్తన ప్యాకెట్లు, క్యూ ఆర్ కోడ్‌లను పరిశీలించారు. ఏ పంట విత్తనాలు.. ఏ రకాలను రైతులు ఎక్కువగా అడుగుతున్నారని వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో విత్తనాల కొనుగోలు కోసం వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. పోయిన ఏడాది ఏ పంట వేశారు? ఈసారి ఏ పంట వేస్తున్నారు? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానకాలం సీజన్‌కు సంబంధించి అవసరమైన మేర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, రసీదు తప్పక తీసుకోవాలన్నారు. జిల్లాలో 2 లక్షల ఎకరాలకు అవసరమైన 4 లక్షల పత్తి ప్యాకెట్లకు గాను ఇప్పటికే 4.50 లక్షల ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇంకా లక్ష ప్యాకెట్లు తెప్పించేందుకు కార్యాచరణ చేశామన్నారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగు, పిల్లిపెసర విత్తనాలను 60 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందొద్దని, అవసరానికి మించి అందుబాటులో ఉన్నాయని, ప్రశాంతంగా రైతులు కొనుగోలు చేయవచ్చన్నారు. కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, అర్బన్ మండల వ్యవసాయాధికారి కిశోర్‌బాబు తదితరులు ఉన్నారు.

## డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి

### డీఏవో విజయనిర్మల



విత్తనషాపులో తనిఖీలు నిర్వహిస్తున్న డీఏవో విజయనిర్మల

ఖమ్మం రూరల్, మే 31 : అపరిచితుల వద్ద కాకుండా మీకు నమ్మకమైన డీలర్ వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల రైతులకు సూచించారు. శుక్రవారం ఆరెకోడు తండా, తనగంపాడు గ్రామాల్లో పర్యటించిన ఆమె రైతు అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. అలాగే పలు విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ గ్రామాల్లో తిరుగుతూ తక్కువ ధరకు విత్తనాలు అమ్ముతామనే వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. డీలర్ వద్ద గడువు మీరిన తేదీ ఉన్నా, లాట్ ఐడీ తదితర వివరాలు లేకుంటే వాటిని కొనుగోలు చేయొద్దన్నారు. గ్రామాల్లో భూమి సారాన్నిబట్టి, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలకు అనుగుణంగా విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. వర్షాలు త్వరలోనే కురిసే అవకాశం ఉన్నందున లోతు దుక్కులు దున్నుకోవాలని, పచ్చిరొట్ట ఎరువుల సాగు చేపట్టాలన్నారు. కూసుమంచి డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎస్.విజయచంద్ర, మండల వ్యవసాయాధికారి వానకాలం సాగుపై రైతులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా పత్తి విత్తనాలు

### అదనపు కలెక్టర్ వేణుగోపాల్



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

పాల్వంచ, మే 31 : జిల్లాలోని రైతులకు సరిపడా పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఈ విషయంలో ఆందోళన చెందొద్దని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ స్పష్టం చేశారు. శుక్రవారం పాల్వంచలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేసిన ఆయన.. ఎన్ని విత్తనాలు? రైతులు ఏ మేరకు కొనుగోలు చేశారు? అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 2,16,625 ఎకరాల్లో పత్తి సాగవుతున్నట్లు అంచనా వేశామన్నారు. ఇప్పటివరకు 3,83,004 పత్తి విత్తన ప్యాకెట్లు జిల్లాకు వచ్చాయని, 5,41,560 ప్యాకెట్లు మరో వారం రోజుల్లో వస్తాయని వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి బాబురావు మాట్లాడుతూ 56-60 మిల్లీమీటర్ల వర్షం కురిసిన తర్వాతే రైతులు పత్తి విత్తనాలు నాటాలన్నారు. బీటీ-2 పత్తి విత్తన రకాలు చాలా ఉన్నాయని, గత సీజన్‌లో వచ్చిన దిగుబడిని బట్టి విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. కాగా.. పాల్వంచలోని సాయిరాం ఆగ్రోస్, బాలాజీ ట్రేడర్స్ విత్తన దుకాణాల్లో రిజిస్టర్లను పరిశీలించారు. వారి వెంట ఏడీఏ టెక్నికల్ రవికుమార్, మండల వ్యవసాయాధికారి శంభోశంకర్ ఉన్నారు.

## సకల సదుపాయాలతో వైద్య కళాశాల నిర్మాణం

### ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, మే 31 : సకల సదుపాయాలతో భవిష్యత్ తరాలకు అనుగుణంగా ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణం ఉండాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ ఎన్.వాణితో కలిసి ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి అర్బన్ మండలం బల్లేపల్లి, రఘునాథపాలెం గ్రామాల్లో సుమారు 43 ఎకరాల స్థలం గుర్తించామన్నారు. నిర్మాణ ప్లాన్‌లో కళాశాల భవనాలు, విద్యార్థుల హాస్టల్, అధ్యాపకుల క్వార్టర్స్ నిర్మాణం, హైవేకు కళాశాల ప్రధాన భవనం ఫేసింగ్ ఉండి.. విజుబుల్‌గా ఉండేట్లు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు వైద్య విద్య సంచాలకులు డాక్టర్ విమల థామస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

## పాలేరు సమస్యలపై దృష్టి

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం, మే 31 : పాలేరు నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొక్కిరేణి, ఎర్రగడ్డ, తాళ్లచెరువు, బీరోలు, బచ్చోడు, బచ్చోడుతండా, జూపెడ, కాకరవాయి, సోలీపురం గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా పర్యటించిన ఆయన ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నియోజకవర్గ ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, మూడేళ్లలో అర్హులందరికి ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. దరఖాస్తు చేసుకున్న అర్హులకు రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. పాలేరు నియోజకవర్గంలో తాగు, సాగునీటి కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నందున, నాగార్జున సాగర్‌లో నీళ్లు ఉన్నా.. లేకున్నా పాలేరు రిజర్వాయర్‌ను నింపేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం సర్వే చేయడానికి ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. నియోజకవర్గంలో వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బోడ మంగీలాల్, జడ్పీటీసీ బెల్లం శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బుద్ద వంశీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, రామసహాయం నరేశ్‌రెడ్డి, కొప్పుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి